

# హైదరాబాద్ వార్త

# మెడికల్ షాపులపైనా డేగకన్ను..!

**◆ నిషేధిత డ్రగ్స్‌ను అమ్ముతున్న వారిపై చర్యలకు సిద్ధం.. ◆పక్కదారి పడుతున్న పలు ఔషధాలపైనే దృష్టి**



**హైదరాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త**

ఇకపై నగరంలో మత్తు, కండలకోసం ఔషధాల వినియోగంపై నిఘా ఉంచాలని పోలీసులు నిర్ణయించారు. ఇప్పటివరకు కేవలం మాదకద్రవ్యాల పైనే దృష్టిపెట్టిన అధికారులు ఇకపై మత్తు ఆ దిశలో చర్యలు ఉపక్రమించనున్నారు. ఈ విషయంలో అధికారులు మెడికల్ షాపులపై కూడా డేగకన్ను వేస్తున్నారు. పక్కదారి పడుతున్న పలు ఔషదాలపైనే దృష్టిసారించాలని నిర్ణయించారు. డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నగరవ్యాప్తంగా నిఘా ముమ్మరం చేసిన అధికారులు కోడిన్ ఫాస్ఫేట్ సిరప్, అల్పాహారం, స్టామ్‌బేర్, ఏర్‌క్లైన్, డెబొలాన్ టాబ్లెట్లు, డ్యూరాడెక్స్, సీ-జెక్ట్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ముఠాలు కూడా చిక్కాయి. ఈ నిఘా, దాడులుకొనసాగించాలని నిర్ణయించిన అధికారులు ఇలాంటి ఔషధాల వినియోగాన్ని అధ్యయనం చేస్తున్నారు. కాగా శస్త్రచికిత్స చేసే సందర్భంలో రోగులకు మత్తు కలిగించడం కోసం ఇచ్చే కీటమైన్ హైడ్రోక్లోరైడ్ మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తుండడంతో అనేక మంది మత్తుకు బానిసైన వారు ఈ ఇంజెక్షన్‌ను వినియోగించడం ప్రారంభించగా, వెంటనే స్పందించిన ప్రభుత్వం దీన్ని నియంత్రణ జాబితాలోని మందుగామార్చింది. కీటమైన్ నుంచి పొడిని తయారుచేసి నిషాకోసం వాడుతుండడంతో కేంద్రం ఈ పొడిని నిషేదిత మాదకద్రవ్యాల జాబితాలో చేర్చింది. ఇప్పుడు ఈ పొడిని ఇంట్లోనే తయారుచేసి విక్రయిస్తున్న,వినియోగిస్తున్న వారు పుట్టుకువచ్చారని అధికారులు కూడా గుర్తించారు. ప్రస్తుతం మత్తుపదార్థాలలో గంజాయికి ప్రత్యామ్నాయంగా నైట్రావిట్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం ఇదొక్కటే కాదు మాదకద్రవ్యాలు కాని ఇలాంటి మత్తు మందులు అనేకం నగరంలో చెలామణి అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి వారికి బ్లాక్‌మార్కెట్‌లో ఆ మత్తు 'మందుల్ని సరఫరా చేయడానికి అనేక వ్యవస్థీకృత ముఠాలు సైతం పుట్టుకువచ్చాయి. గంజాయికి బానిసైన యువత ప్రస్తుత నైట్రావిట్ టాబ్లెట్స్ వినియోగిస్తున్నారు.మత్తుకోసం వినియోగిస్తున్న ఔషధాల్లో దగ్గు మందులే అధికంగా ఉన్నాయి. కొన్ని రకాలైన ఔషదాలను సేకరించడం కష్టసాధ్యం. అలాగే వైట్నర్‌ను ఖరీదు చేయడం తేలికే అయినప్పటికీ వినియోగించేప్పుడు ఇతరుల దృష్టిలో పడే అవకాశాలుంటాయి. ఈ కారణాల నేపథ్యంలో దగ్గుమందు ఎక్కువగా వినియోగిస్తున్నారు. అత్యధిక శాతం దగ్గు మందుల్ని డెక్స్‌ట్రోమెథార్ఫిన్, కోడైన్‌లతో తయారు చేస్తారు. కోడైన్‌తో కూడిన ఈ రసాయనం నియంత్రిత జాబితాలో ఉన్న మాదవద్రవ్యం. మత్తును కలిగించే దీన్ని కేవలం ఔషధాత తయారీకి మాత్రమే వినియోగిస్తుంటారు. ప్రధానంగా డెక్స్‌ట్రోమెథార్ఫిన్ కారణంగానే అనేక మంది దగ్గు మందులకు బానిసలు అవుతున్నారని పోలీసులు గుర్తించారు.కాగా,కొన్ని ఔషధాలను కేవలం మత్తు కోసమే కాదు. కండల కోసమూ వినియోగించడం ఆందోళన కలిగించే అంశం. అత్యవసర సమయాల్లో వినియోగించే మెఫ్‌టెర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్‌ను కొందరు యువత స్టెరాయిడ్‌గా వినియోగిస్తోంది. జిమ్‌లో ఎక్కువ సమయం గడిపి, కండలు పెంచడానికి ఈ సూది మందు తీసుకుంటోంది. ఈ ఇంజెక్షన్‌ను అక్రమంగా యువతకు విక్రయిస్తున్న ముఠాలను గతంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

**డ్రగ్స్ బారిన పడుతున్న యువత...**

నగరంలో చాపకింద నీరులా డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరుగుతుండడంతో యువకులు మృత్యువుబారిన పడుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత వింత చేష్టలు, నలుగురిలో ఉన్నా ఒంటరిగానే ఉండడం, పార్టీ ఏదైనా మత్తులో తూగడం వంటి సంఘటనలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పార్టీలు, పబ్‌లు ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్ వినియోగం పెరగడంతో యువత తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలా ఎక్కడైనా ఏదో ఒక స్థాయిలో డ్రగ్ వినియోగం జరుగుతోందని అంటున్నారు. స్నేహితులతో కలిసి డ్రగ్స్ తీసుకుని వచ్చి ఇంట్లో ఒంటరి జీవితం గడుపుతున్నారు. డ్రగ్స్ వినియోగం పెరిగి వింతగా ప్రవర్తించిన సంఘటనలతో వారి తల్లిదండ్రులు భయపడి చికిత్స చేయించడం కోసం వైద్యుల వద్దకు పరుగులు తీసే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి కేసులు గతంలో కంటే 10 నుంచి 15శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. స్టిమెలెన్స్, నాన్ స్టిమెలెన్స్ అని రెండు రకాల మాదవ ద్రవ్యాలు ఉంటాయని, ఇందులో నాన్ స్టిమిలెన్స్ లో మత్తుగా ఉంటారని, కొకైన్, ఎల్ఎస్‌డి, ఎండిఎంఏ తదితర స్టిమిలెన్స్ డ్రగ్, హెరాయిన్, కొకైన్, డైజోపియన్, గంజాయ్ తదితర వాటిని నాన్ స్టిమెలెన్స్‌గా పరిగణిస్తామని వైద్యులు చెబుతున్నారు.

డ్రగ్ తీసుకోవడంవల్ల నిద్ర పట్టదని, కడుపులో నొప్పి, కాళ్లు చేతులు వణకడం, విరేచనాలు, బిగ్గరగా ఏడవడం, నోట్లో నుంచి నీరు కారడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటారు. స్టిమెలెన్స్ డ్రగ్స్‌వల్ల వేగంగా గుండె స్పందనలు పెరుగుతాయి. గుండె వైఫల్యం చెందడం,డీ హైడ్రేషన్, మూత్ర పిండాలు వైఫల్యం చెందడం, స్ట్రోక్ వంటి ఇబ్బందులువస్తాయి.

డ్రగ్స్‌ను ఎక్కువ డోసు తీసుకునే వారికి గుండె జబ్బులు ఉంటే వారికి ఆకస్మాత్తుగా గుండెపోటు వస్తుంది. మితిమీరిన డోసువల్ల మెదడు నిస్తేజంగా మారడం, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందకపోవడం, చనిపోవడం వంటి ముప్పు ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# కేజ్రీవాల్‌పై ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు

**ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్**



మాట్లాడుతున్న డా.దిడ్డి సుధాకర్

**సైఫాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిబిఐచే ఎన్ని అక్రమ కేసులు పెట్టించినప్పటికి ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సామాన్యుల ప్రయోజనాల కోసం పోరాడుతూనే ఉంటారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. బిజెపి ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతూ అణిచివేసేందుకు ఎన్ని కుట్రలు పన్నినా బయపడేది లేదని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ చెప్పారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేజ్రీవాల్ అధికారిక నివాసం పునరుద్ధరణలో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బిజెపి అధికార దుర్వినియోగంతో సిబిఐని ప్రయోగించి మళ్లీ తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. పునరుద్ధరణ చేసింది పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అని ఇది అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధం లేదని, ఆయనపై సిబిఐ ప్రాథమిక విచారణ పేరుతో కేసు నమోదు చేయడం బిజెపిలోని నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు తమ శక్తినంత ఉపయోగించి కేజ్రీవాల్‌పై 50కి పైగా కేసులు పెట్టించారని, సిబిఐ విచారణ చేస్తున్నదని వాటి నుంచి, పోలీసులకు, సిబిఐ, ఎసిబిల దాడులకు ఆమ్ ఆద్మీ పార్టీ భయపడే ప్రసక్తి లేదని సుధాకర్ హెచ్చరించారు.

సిబిఐ తన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో సామాన్యుల తిరుగుబాటు తప్పదని చెప్పారు.

# జివో 142ను వెంటనే రద్దు చేయాలి : ఎంపి.ఆర్.కృష్ణయ్య

**5న డిహెచ్ కార్యాయం ముందు పారామెడికల్ సిబ్బంది భారీ ధర్నా**



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:**

వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందిని తొలగించి శాఖను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం జీవో 142ను తీసుకువచ్చిందని దాన్ని వెంటనే రద్దు చేసి వారికి న్యాయం చేయాలని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లో వైద్యఆరోగ్యశాఖ బిసి ఉద్యగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఫ్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, మెడికల్ కాలేజీలు వంటివి ఏర్పాటు చేసినప్పటికీ వాటికి తగినంత సిబ్బందిని నియమించకుండా ఉన్నవారిని కుదించడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. వైద్యఆరోగ్యశాఖ సంచాలకుల కార్యాలయాల్లో 4వతగతి ఉద్యోగిగా నియామకం పొంది వివిధ రకాలుగా ప్రమోషన్లు పొంది డిప్యూటీ డైరెక్టర్లుగా రిటైర్మెంట్ వరకు ఒకేచోట కొనసాగుతున్నవారికి ఒక రూల్ ..నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి ప్రయోజనాలు చేకూర్చే పారామెడికల్ సిబ్బందికి ఒకరూల్ ఏంటని ప్రశ్నించారు. వైద్యరోగ్యశాఖ బిసి నాయకులు బొధు శ్రీనివాస్ మాట్లాడుతూ పారామెడికల్ సిబ్బందికి వ్యతిరేకంగా తెచ్చిన 142 జీవోను రద్దుచేయాలని అక్టోబర్ 5న హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. దీనికి రాష్ట్రంలో పనిచేస్తున్న 6వేల మంది పారామెడికల్ సిబ్బంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, టి.నారాయణ, కె.అనిల్, జి.అంజి, వేముల రామకృష్ణ, నిరంజన్, శివానందం, భాస్కర్, జగన్‌మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, జగన్, చిరంజీవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీలో మెట్రో రైల్ పనులు ప్రారంభించాలి

**పాతనగరం మెట్రో రైల్ జెఎసి నేతలు**




మాట్లాడుతున్న నర్సింహ

**సైఫాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:**

హైదరాబాద్ పాతనగరం ప్రజలను బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తే సహించేదిలేదని మెట్రో రైల్ సాధన కోసం పోరాటాలు తీవ్రతరం చేస్తామని పాతనగర మెట్రోరైల్ జెఎసినేతలు హెచ్చరించారు. ఇందులో భాగంగా అక్టోబరు మొదటి వారంలో ప్రతిపాదిత ఫలక్‌నుమా మెట్రోరైల్ డిపో వద్ద వేలాది మందితో భారీగా ధర్నా నిర్వహిస్తామని జెఎసి నాయకులు హెచ్చరించారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి నేతలు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కె.వెంకటేష్, కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మొహమ్మద్ ఆల్‌హాజరీ, టిడిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి, బిఆర్ఎస్ పార్టీ పాతనగరం నాయకులు సయ్యద్ సలీం తదితరులు మాట్లాడారు. ఇ.టి.నర్సింహ మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో సగం జనాభా కలిగి ఉన్న పాత నగరంలో మెట్రోరైల్ విస్తరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా జాప్యం చేయడం సిగ్గుచేటని నిశితంగా విమర్శించారు. పాతనగరంలో మెట్రో కనెక్టివిటి విస్తరణను తక్షణమే ప్రారంభిస్తున్నామని సిఎం కెసిఆర్ గతంలో అసెంబ్లీ హామీ ఇచ్చారని, మంత్రి కెటిఆర్ మరో అడుగు ముందుకేసి 500 కోట్లు కేటాయించామని ప్రకటించారని, అయితే పనులు ఎందుకు ప్రారంభించలేదని, పాతనగరంలో మెట్రోరైల్ లేకుండా హైదరాబాద్ నగరం విశ్వనగరం ఏలా అవుతుందని నర్సింహ ప్రశ్నించారు. ఎంఐఎం పార్టీ వత్తిడితో పాతనగరంలో మెట్రోరైల్ నిర్మాణంలో జాప్యం చేస్తే ప్రభుత్వంపై తీవ్రంగా వత్తిడి పెంచుతామని హెచ్చరించారు. ఎంజిబిఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5. కిలో మీటర్ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

# తాజ్ డెక్కన్‌లో ఆకట్టుకున్న "పింక్ లెమోనేడ్ " ఎగ్జిబిషన్

**-భారీగా తరలివచ్చిన మహిళలు ,చిన్నారులు**




తాజ్ డెక్కన్‌లో జరిగిన పింక్ లెమోనేడ్‌లో పాల్గొన్న నిర్వాహకులు అంకితాసంఘీ, నందితా సురేఖ, సాక్షి గోయెంకా

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:**

చిన్నారులకు విభిన్న రకాల వస్త్రాలు, వస్తువులతో శనివారం బంజారా హిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఏర్పాటు చేసిన "పింక్ లెమోనేడ్" కిడ్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకులు అంకితా సంఘీ, నందితా సురేఖ, సాక్షి గోయెంకాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈప్రదర్శనకు విశేష స్పందన లభించింది. కిడ్స్ క్లాతింగ్, ఉమెన్స్‌వేర్, స్టేషనరీ, గిఫ్ట్స్,జ్యూవెల్లరీ, స్లీవ్‌వేర్, టాయ్స్,ఎడ్యూకేషన్ బుక్స్, ప్లే ఏరియా ఇలా విభిన్న రకాల వస్తువులతో 65కి పైగా స్టాల్స్‌ఏర్పాటు చేశారు. అలాగే సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఉదయం 11నుంచి సాయంత్రం 7గంట లవరకు సాగిన ఈప్రదర్శనలో సుమారు 3వేలకు పైగా సందర్శకులు పాల్గొన్నారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దృశ్యం



# రేపటి నుంచి పనులను నిలిపివేస్తున్నాం

## - జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు



తమ సమస్యపై మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు

**తార్నాక, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**

సంవత్సర కాలంగా తమకు బిల్లులు చెల్లించని కారణంగా తాము రేపటి నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడ కూడా పనులు చేయమని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గండి కోట ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.ఈ మేరకు అసోసియేషన్ సభ్యులతో ఆయన అత్యవసర సమావేశాన్ని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ బిల్లులు రాకపోవడంతో అప్పుల బాదలు ఎక్కువై కాంట్రాక్టర్లు చనిపోతున్నా ఈ ప్రభుత్వానికి చలనం లేకపోవడం ధారుణం అన్నారు. మంత్రి కేటీఆర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలు తమ సమస్యను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. బిల్లులు చెల్లించని కారణంగా ఏ ఒక్క కాంట్రాక్టర్ కూడా పనులు చేయవద్దని తాము తీర్మాణం చేసుకున్నామని చెప్పారు. కనీసం టెండర్లు కూడ వేయవద్దని హెచ్చరిస్తున్నట్లు చెప్పారు. అప్పుడైనా ప్రభుత్వం దిగివస్తుందేమో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.విజయ్ కుమార్,కోశాధికారి ఎం.వీరయ్య, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాస్, కె.,రాజు, శివరాత్రి వెంకటేష్, ఎం.రాజు, వి.నరసింహ్మ, ఆర్.యాదయ్య, ఎ.శేఖర్, శివరాత్రి శ్రీనివాస్, ఎండి.రషీద్, టి.ఆనంద్ కుమార్, టి.సునీల్‌కుమార్, దేవేందర్ తధితరులు పాల్గొన్నారు.

## పెళ్లికాని మోదీ, రాహుల్‌లకు బాధ్యతలు ఎలా తెలుస్తాయి : ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం

**ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** పెళ్ళికాని రాహుల్ గాంధీకి, కుటుంబమే లేని నరేంద్రమోడీకి బాధ్యతలు ఎలా తెలుస్తాయని మాజీమంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అమలయ్యే హామీలను ఇస్తారని, కాంగ్రెస్, భాజపాలవి కల్లిబొల్లి కబుర్లని దానం అన్నారు. అసదుద్దీన్ ఓవైసీ మహారాష్ట్రకు చెందినవారని చెప్పిన రేవంత్, రేపు ఓల్డ్‌సిటీ మైనార్టీలంతా పాకిస్తాన్‌కు చెందిన వారని చెపే ప్రమాదం ఉందని, అసదుద్దీన్ కుటుంబం మహారాష్ట్ర నుంచి వలసి వచ్చిందని మాట్లాడిన పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ నియోజ కవర్గంలోని బంజారహిల్స్ రోడ్ నెంబర్ 10లోని జేభారా నగర్ బస్తీలో శనివారం షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజక వర్గంలో 2743 డబల్ బెడ్‌రూమ్‌లు మంజూరయ్యాయని, మిగతా అందరికీ అతి త్వరలో ఇస్తామని స్పష్టం చేశారు. దళిత బంధు, బీసీబంధు, మైనార్టీ బంధు, ఇతర పథకాలన్నీ దేశంలో ఎక్కడేలని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని కాంగ్రెస్, బిజెపి పార్టీ నాయకులు ఆచరణకు అమలు కానీ హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జావేద్ జబేర్ అహ్మద్ పటేల్, అంజాద్, రతన్ నాయక్, రాములు చౌహాన్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో 15 మంది చిన్నారులకు గుండె సర్జరీలు సక్సెస్

**- డైరెక్టర్ నగరి బీరప్ప**

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** నిమ్స్‌లో వారం రోజులుగా బ్రిటన్ వైద్యుల బృందం చిన్నారుల గుండెవ్యాధులతపై నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంప్‌లో 15మంది చిన్నారులకు సర్జరీలు విజయవంతమైనట్లు నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఈమేరకు శనివారం నిమ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 500మంది చిన్నారులను పరిశీలించి టెస్టులు చేయగా 15మందికి విజయవంతంగా సర్జరీ పూర్తి చేశామన్నారు. అలాగే నిమ్స్‌లో చిన్నపిల్లలకోసం ఉచితంగా ప్రతి గురువారం ప్రత్యేకంగా క్యాంప్‌ను ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.




# శ్మశానవాటికలు, చర్చిల అభివృద్ధికి కృషి

## మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** శ్మశానవాటికలు, చర్చిల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలోని మూడు క్రిస్టియన్ గ్రేవ్‌యార్డ్‌లలో తన నియోజకవర్గం అభివృద్ధి నిధులు రూ. 1.32 కోట్లతో చేపట్టనున్న వివిధ పనులను మంత్రి తలసాని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎవరూ ఆలోచించని విధంగా సిఎం కేసీఆర్ అన్నివర్గాలకు చెందిన శ్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ మూడు గ్రేవ్‌యార్డ్‌లలో కాంపౌండ్ వాల్‌నిర్మాణం, పాత్‌వేల నిర్మాణం, లైటింగ్, నీటి సౌకర్యం వంటి అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా చనిపోయిన వారిని గ్రేవ్‌యార్డ్‌కు తీసుకొచ్చేందుకు ఒక వాహనాన్ని తన సొంత నిధులతో అందజేస్తానని మంత్రి ప్రకటించారు. బోయిగూడ గ్రేవ్‌యార్డ్‌కు ఆర్చి నిర్మాణాన్ని చేపపట్టనున్నట్లు తెలిపారు. చర్చిల అభివృద్ధికి సంబంధించి వివరాలు అందజేస్తే త్వరలో నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముందుగా మంత్రిని పాదర్స్ ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఆశీర్వదించారు. ఈ కార్యాక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, కార్పొరేటర్ హేమలత, డీఎంసీ శంకర్, ఈఈ సుదర్శన్, పాదర్ ఆరోగ్యం, బాలశౌరి, ప్రతాప్, బాలస్వామి, కమిటీ సభ్యులు ఆంథోని, జూట్‌పాల్, వెంకటేషన్ రాజు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

### డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్ దొడ్ల

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** డెంగ్యూ వ్యాధి పట్ల డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సూచించారు. శనివారం ఎల్లమ్మబండ ప్రభుత్వ హాస్పిటల్‌లో డెంగ్యూవ్యాధి లక్షణాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిహెచ్ఎంసి మెడికల్, ఎంటమాలజీ, ఆశావర్కర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా డెంగ్యూవ్యాధి మెల్లగా పెరుగుతుందని, ఈ విషయంలోనే జిహెచ్ఎంసి ఆరోగ్యశాఖ, ఎంటమాలజీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, డాక్టర్ మను పప్పన్, ఎంటమాలజీ ఏఈ ఉషరాణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాములుగౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజేందర్, పద్మయ్య, నరసింహులు, వైద్య సిబ్బంది ప్రియాంక, భవాని, సుజీలీల, బాలామణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### డివిజి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** డివిజి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీలో నివసించే మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పిజెఆర్ నగర్ కాలనీ బ్లాక్‌నెంబర్ 11లో నివసించే ఎస్.సావిత్రి(61) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్ట్ ద్వారా రూ. 5000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షౌకత్‌అలీ మున్నా, జి.వాసుదేవరావు, పుట్టందేవి, రేణుక పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : లాస్య నందిత

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. శనివారం మాజీ బోర్డు సభ్యులు పాండుయాదవ్‌తో కలిసి 6వ వార్డులోని నందమూరినగర్‌లో పాదయాత్ర జరిపి ఇంటింటికి ప్రచారం జరిపారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ సిఎం కేసిఆర్ ఆశీసు స్సలతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజలు ముందుకు వస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి : హారిక


స్వచ్ఛతాహీ సేవలో పాల్గొన్న సిఈఓ మధుకర్‌నాయక్, మార్కెట్ చైర్మన్ హారిక తదితరులు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ హారిక ఆనంద్ బాబు, కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛతా హీ సేవా మహాశ్రమదాన్ పరిసరాల పరిశుభ్రతపై శనివారం బోయిన్‌పల్లిలోని మార్కెట్‌లో నిర్వహించిన పరిసరాల పరిశ్రుభతలో వారు పాల్గొని అక్కడక్కడ పేరుకు పోయిన చెత్తా,చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వెంకన్న, వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, గౌరవసభ్యులు గిరిధర్, బత్తుల నారాయణ, దేవులపల్లి శ్రీను పాల్గొన్నారు.

### అడ్డగుట్ట డివిజన్ అభివృద్ధికి కృషి : లింగాని ప్రసన్న


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న లింగాని ప్రసన్న తదితరులు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌ను గ్రేటర్‌లో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు దశాల వారిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని డివిజన్ కార్పొరేటర్ లింగాన ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. అడ్డగుట్ట, లోహియ నగర్, కొండా రెడ్డి నగర్ ప్రాంతాల్లో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగాని మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ సహాయ సహకారాలతో అడ్డగుట్ట అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈలు శ్రవంతి, నిఖిత, బిఆర్ఎస్ నాయకులు సత్తయ్య గౌడ్, మనోహర్, పొన్నాల రాజు, వసంత, మల్లేశ్, శ్రీరామ్ నాయక్, రామప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి: ఎమ్మెల్యే


పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

**నిజాంపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ప్రగతియాత్ర 119వ రోజులో భాగంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో శనివారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో రూ.7కోట్ల 6లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతికాలనీలో మెరుగైన మౌళికవసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమీషనర్ రామకృష్ణ, కార్పొరేటర్లు శ్రీరాములు, వెంకటరామయ్య, వాణి,మాధవి, సుజాత,లక్ష్మీకుమారి, శ్రీనివాస్‌యాదవ్, ఆయా డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### 4న గుర్రం జాషువా 128వ జయంతి సభ

**సైఫాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** ప్రముఖ సాహితీ మిత్ర కాకుమాను ప్రసాదరావు స్థాపించిన సమత సాహితీ వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 4వ తేదీ సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో మహాకవి, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా 128 జయంతి సభ నిర్వహిస్తున్నామని వేదిక తెలిపింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశిశ్రీ, ప్రధానకార్యదర్శి నీరుకొండ స్పూర్తి, సమన్వయ కర్త వై.వెంకటరత్నం మాట్లాడుతూ ఈ సభలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎసిబి జాయింట్ డైరెక్టర్ డా.చేతన పాల్గొంటారని, అతిధులుగా ప్రముఖ కవులు ఆచార్య శిఖామణి, డా. కోయి కోటేశ్వర్‌రావు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా.పసునూరి రవీందర్, హైకోర్టు న్యాయవాది చింతల శ్రీకాంత్, మానవహక్కుల కార్యకర్త విశ్వనాథ్ జయంతి పాల్గొంటారని చెప్పారు. ఈ సభకు శశిశ్రీ అధ్యక్షత వహిస్తారన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

### సెక్టార్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన

**పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల నియమనిబంధనల మేరకు సజావుగా జరిపేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు పేర్కొన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ పరిధి సరోజినిగార్డెన్‌లో కుత్బుల్లాపూర్‌లోని 41 సెక్టార్‌లలో ఉన్న ఆయా విభాగాల అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఒక్కో సెక్టార్ కింద 17 పోలింగ్ బూత్‌లను కేటాయించడం జరుగుతుందని, ఆ సెక్టార్ ఉన్న అధికారి పూర్తి వ్యవహారాలను చూసుకోవాలని ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలానగర్ జోన్ ఎసిపి గంగారామ్, సిఐలు, సెక్టార్ అధికారులు, బిఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

#### ఆదివాసీ ఎరుకల రాజకీయ అణిచివేతపై
### రాష్ట్రవాప్త పోరు: కూతాటి రాములు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** రాజకీయంగా తీవ్ర వివక్షకు గురైన ఆదివసీ ఎరుకలను అణిచివేసే కుట్రలను సంఘటితంగా తిప్పికొట్టాలని తెలంగాణ ఎరుకల సంఘ రాష్ట్ర అధ్యక్షులు (కుర్రు) కూతాడి రాములు పిలుపునిచ్చారు. శనివారం కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎరుకల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులైన గవర్నర్ కోటాలో ఎంఎల్‌సి గా ప్రకటించిన కుర్రా సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించటం సమంజసం కాదన్నారు. మరోసారి గవర్నర్ వివాదాలకు తెరలేపి కుర్రా సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ఎరుకల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులుగా, సంగారెడ్డి మాజీ ఎంఎల్ఏగా ఆయన పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించారని తెలిపారు. కార్మికనేతగా, ఎరుకల సంఘ ప్రతినిధులకు ఎన్నోసేవలు అందించిన కుర్రా సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించడం అణగారిన, బడుగు, బలహీనవర్గాలకు అన్యాయం చేసినట్లేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎరువల సంఘ కోశాధికారి కూతాటి రవికుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ బిజెపి మద్దతుతో గవర్నర్ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని దీనిపై రాష్ట్ర వ్యాప్తఆందోళన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కూరాకుల శ్యామల, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేసారం నాగులు, శ్రీరామానంద్, మేడ్చెల్ జిల్లా అధ్యక్షులు అంగడి నారాయణ, రస్తాపురం సత్యనారాయణ, బిజిలి ఎల్లేశ్, కూరాకుల రాము, కూరాకుల కుమార్, కుంభ అశోక్, కుంభ విజయ్, కావడి రవి, ఆర్.మహేశ్, భరత్, దేవరాయ కుమార్, బాణం కృష్ణ, కూరాకుల లీల, పాలకొండ తిరుపతమ్మ, సమ్మక్క, కావడిశోభ, వసంత తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ పార్టీ కుట్రలకు వ్యతిరేకంగా కెసిఆర్‌పై పోటీ

#### యుగ తులసి పార్టీ అధ్యక్షుడు శివకుమార్

**సైఫాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికార పార్టీ కుట్రలకు వ్యతిరేకంగా సిఎం కెసిఆర్‌పై తాను పోటీ చేస్తానని యుగ తులసి పార్టీ జాతీయ అధ్యక్షుడు పొలిశెట్టి శివకుమార్ హెచ్చరించారు. అంతేకాకుండా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసి తమ సత్తా చాటుతామన్నారని చెప్పారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ రిజిష్టరైన చిన్న, చిన్న పార్టీలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. తమ పార్టీ జాతీయ ఎన్నికల కమిషన్ రోడ్డు రోలర్ గుర్తును కేటాయిస్తే ఆ గుర్తును తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నుతున్నదని, అయినప్పటికి తమకు న్యాయమే జరిగిందన్నారు. చిన్ని, చిన్న పార్టీల గుర్తులను మార్చాలని కుట్రలు పన్నుతున్న బిఆర్ఎస్ పార్టీ 'కారు గుర్తు' నే మార్చుకుంటే సరిపోతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో గోవధ నిషేదం చట్టం అమలు జరగడం లేదని, గత బక్రీద్ సందర్భంగా నగరంలో కేవలం 5వేలు గోవులను హత్య చేయడం జరిగిందన్నారు. గోవులను రక్షించడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చంద్రస్వామి, సంగమేశ్వరచారి, ఆదివేణుగోపాల్, మహేష్, ఫణికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివకుమార్

### వైశ్యులను దూరం చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ

**గోషామహల్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వైశ్యులను దూరం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీలో ఉన్న వైశ్యులు వాపోతున్నారు. రానున్న ఎన్నికల్లో వైశ్యుల ఓట్లు కీలకంగా మారనున్నాయి.. ఉమ్మడి రాష్ట్రంనుంచి వీడిన తరువాత రాష్ట్రంలో వైశ్యులను రాజకీయపరంగా ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా అణిచి వేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంతంత మాత్రమే వైశ్యులకు గుర్తింపు ఇచ్చినప్పటికి, తెలంగాణ రాష్ట్రం పది సంవత్సరాల నుంచి అధికారంలో లేకపోయినప్పటికి కనీసం కాంగ్రెస్‌పార్టీలో పదవులను ఇవ్వకుండా అణిచివేస్తూ ఏమాత్రం వైశ్యులకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేద వాపోతున్నారు. రాష్ట్రంలో జనాభాలో ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 15వేల వరకు ఓటర్ల ఉన్నట్లు వైశ్యులు అంటున్నారు. వీరు కూడ ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలుపుతారో వారే అధికారంలో వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార పార్టీ ఒక ఎమ్మెల్సీ సీటు, ఒక ఎమ్మెల్యే, రెండు కార్పొరేషన్ చైర్మన్ల పదవులు ఇచ్చి బిఆర్ఎస్ వైపు తిపుకుంటున్నారు. అదే విధంగా కులాలకు, మతాలకు అతీతకంగా సేవా కార్యక్రమాలను చేపట్టడం వైశ్యులు ముందు వరుసలో ఉంటామన్నారు. కాని కాంగ్రెస్ పార్టీలో ఉన్న వైశ్యులకు కనీసం గుర్తింపు ఇవ్వడంలేదని వాపోతున్నారు. ఆత్మగౌరవం, అత్మాభిమానం కోసం ఎంతకైనా రాజకీయంగా తెగించేందుకుగా అడుగులు వేస్తున్నారు. కాని 2023 సంవత్సరంలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైశ్యులకు టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి వైశ్యులు దూరం అయ్యే ప్రమాదముందని అంటున్నారు.

### అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాం: మాజీ కార్పొరేటర్

**జీడిమెట్ల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** సుభాష్‌నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. రాజీవ్‌గృహకల్పకు రూ,4కోట్ల నిధులు మంజురూ చేయించినందుకు గాను ఆర్‌జికె సంక్షేమసంఘం సభ్యులు శనివారం ఆయనను కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌళికవసతులు కల్పిస్తామన్నారు. అంతకుముందు జీవన్‌జ్యోతి నగర్‌కు రూ,54లక్షల నిధులు కేటాయించినందుకు గాను కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జికె, జీవన్‌జ్యోతినగర్‌కు చెందిన సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.

### న్యాయం చేయాలని సిఎంకు బాధితురాలు విజ్ఞప్తి

**సైఫాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** తన వ్యవసాయ భూమిని అక్రమించిన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అరాచకాలను మీడియా ద్వారా ప్రజల దృష్టికి తీసుకువచ్చాననే కోపంతో తనపైన పోలీసులతో అక్రమంగా కేసులు పెట్టించారని దళిత బాధితురాలు, ఎంఆర్‌పిఎస్ నాయకురాలు జున్ను సంతోష్ ఆరోపించారు. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం గుడె పాడు చెరువు శిఖం సర్వే నెంబరు 791లోగల 25 ఎకరాల భూమి తమ ఉమ్మడి కుటుంబానికి చెందినదని చెప్పారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ 25 ఎకరాల భూమిని ఎమ్మెల్యే కబ్జా చేశారని ఆరోపించారు. కాగా తాను హైదరాబాద్ నగరంలోని లాలపేటలో తమ బంధువుల ఇంటో ఉండగా గతనెల 13వ తేదీన ఆత్మకూరు మండలం పోలీసులు తనను అరెస్టు చేసి హన్మకొండ సుబేదారిలో రాత్రి పది గంటల వరకు నిర్బందించారని ఆమె తెలిపారు. ఈ సమయంలో ఎసిపి, సిఐ, ఎస్ఐలు తీవ్ర అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. పోలీసులు ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతూ నాకు అన్యాయం చేశారని, తక్షణమే సిఎం కెసిఆర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

**తార్నాక, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** తార్నాక ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ ఆఫ్ స్కాట్రా ఆధ్వర్యంలో నాచారం ఆర్‌బిఎల్ బ్యాంక్ సౌజన్యంతో తార్నాకలో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. వరల్డ్ హెల్త్ దేను పురస్కరించుకొని తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్యశిబిరానికి ప్రజలు సేవలందుకున్నారు. దీంతోపాటు బ్రెస్ట్ క్యాన్సర్ స్కానింగ్ సేవలందిం చారు. అవసరమైనవారికి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు ఆర్‌బీఎల్ బ్యాంక్ మేనేజర్ మార్టిన్ లూథర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తార్నాక ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ ఆఫ్ స్కాట్రా అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఉచిత వైద్యసేవలను అందించి పేదవారికి సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా. మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, ఓంప్రకాష్, ఆర్‌బీఎల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మహేందర్, సిబ్బంది వంశి, సురేష్, రవి, మాక్స్ విజన్ సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్‌బండ్ పైనున్న చిల్డ్రన్ పార్కువద్ద అనారోగ్యంతో మృతి చెందిన ఘటన ఈనెల 25న జరిగింది. స్థానికుల సమాచారంమేరకు గాంధీనగర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ హాస్పటల్ మార్చురీకి తరలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 60 వరకు ఉంటుందని, ట్యాంక్‌బండ్‌పైనే భిక్షాటన చేస్తూ ఉంటాడని, అనారోగ్యం మరణించి ఉండవచ్చునని భావిస్తున్నారు. మూడురోజులు గడుస్తున్నా ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరూ రాలేదని, ఎవరైనా ఉంటే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

# ఎన్నో ఏళ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ ప్రాంతంలో ఏన్నో ఏండ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం జరుతోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం దోమలగూడలోని పూల్‌బాగ్ అంబేద్కర్ విగ్రహం వద్ద 20 లక్షల బడ్జెట్‌తో, ఈసేవా వద్ద 30 లక్షల బడ్జెట్‌తో ఆయన కార్పొరేటర్ రచనశ్రీతోకలిసి వీడీసీసీ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ ప్రజలు చిన్నపాటి వర్షాలకే ఇండ్లలోకి నీళ్ల వస్తూ చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి సమస్యలు పరిష్కారం కోసం తాను, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీ కూడా ఉన్నతాధికారులతో మాట్లాడి గతంలో పైప్‌లైన్‌లు మార్చటం జరిగిందని, ఇప్పుడు వీడీసీసీ రోడ్లు శాంక్షన్ చేయించటం జరిగిందని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తప్పకుండా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయికృష్ణ, రాంచందర్, హనుమాన్ టెంపుల్ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, కల్వగోపి, లక్ష్మీ గణపతి దేవాలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, మధు, ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ బీజేపీ నాయకులు వెంకటేష్, సలంద్రి శ్రీనివాసయాదవ్, జీహెచ్ఎంసీ డిఈ సన్నీ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

### వినాయక పూజల్లో పాల్గొన్న వడ్డేపల్లి

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి డివిజన్ సంగీత్‌నగర్ కాలనీలోని పలు గణేష్ మండపాలను కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శనివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సౌభాగ్య రెసిడెన్సీ ప్రెసిడెంట్ శివశంకర్ అదేవిధంగా సంగీత్‌నగర్ భక్త నివాస్ కమిటీ అధ్యక్షులు దేశెట్టి శివలు ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఘనంగా స్వాగతించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, డివిజన్ నాయకులు దుర్గాప్రసాద్, ప్రశాంత్, దారాసాయి తదితరులు పాల్గొన్నారు.

**సాయినగర్ కాలనీలో లడ్డూ వేలంపాట**

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలోని వినాయక మండపం వద్ద బిఆర్ఎస్ నాయకులు శివరాజ్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డు వేలంపాటలో పాల్గొన్న సీనియర్ నాయకులు గుండడి ప్రభాకర్ లడ్డూని పాట పాడి కైవసం చేసుకున్నారు.

### గణేష్ దేవాలయం హుండీ ఆదాయం రూ. 12.92 లక్షలు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ శ్రీగణపతి దేవాలయం హుండీ లెక్కింపులో రూ.12,92,410 ఆదాయం వచ్చినట్లు ఈఓ వినోద్, చైర్మన్ ఒదెల సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 30వ తేదీవరకు 24 రోజులలో భక్తులు హుండీలో వేసి రూ.12 లక్షల 92,410 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు హన్మంత్ రావ్ యాదవ్, జయరాజ్, సాయి ప్రసాద్, అశోక్‌లతో పాటు ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### కొంపల్లిని అభివృద్ధి చేయడమే లక్ష్యం: చైర్మన్ శ్రీశైలంయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్

**కొంపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** కొంపల్లి మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో రూ. 8కోట్ల27లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 1వ, 6వ వార్డులలో సిసిరోడ్డు పనులు, 8వ, 17వ వార్డులలో ఆర్‌సిసి పైప్ లైన్ పనులతోపాటు మురుగునీటి కాలువలు, హరితహారంపనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, వైస్‌చైర్మన్ గంగయ్యానాయక్, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, ఏఈ ప్రవీణ్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### టివిఆర్‌లో ఆకట్టుకున్న పిబిఎల్


విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న తల్లిదండ్రులు

**జీడిమెట్ల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** సుభాష్‌నగర్ డివిజన్ పరిధి అపురూపకాలనీలోని టివిఆర్ మోడల్ హైస్కూల్లో ప్రాజెక్ట్ బేస్డ్ లెర్న్ (పిబిఎల్) కార్యక్రమం ఆకట్టుకుంది. ఈసందర్భంగా ఎండి వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు పోషకాహారమైన పప్పు దినుసులలో ఉండే విటమిన్స్ గురించి నీటిలో వస్తువులు కరిగిపోవడానికి గల కారణాలు చక్కగా వివరించారు. మ్యాథమెటికల్ టెక్నిక్స్, రోమన్ నంబర్స్, ఫ్యాక్టర్స్ పజిల్స్, ఇండియన్, ఇంటర్నేషనల్ ఫేస్ వ్యాల్యూ సిస్టమ్, పంట భూముల సారవంతం, వ్యవసాయ భూములు రకాలు, ఖనిజాలు, గనులు మొదలగు అంశాలను సందర్శించడానికి వచ్చిన తల్లిదండ్రులకు అద్భుతంగా తెలియజేశారు. విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులకు అభినందనలు. తమ చిన్నారులను ఉత్తమమైన శిక్షణ ఇస్తున్న టివిఆర్ యాజమాన్యానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

### రోడ్లను బాగు చేయాలని కోతిబొమ్మలకు వినతి


కోతిబొమ్మలకు వినతి పత్రాలు ఇస్తున్న భాజపా నాయకులు

**నిజాంపేట, 30 ప్రభాతవార్త :** మూడు సంవత్సరాలుగా రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడానికి ఐదు కోట్ల నిధులు కేటాయించిన అధికార బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్య వైఖరి, గుంతల మరమ్మతులు చేపట్టకపోవడాన్ని నిరిసిస్తూ భాజపా నాయకులు ప్రగతినగర్ కోతిబొమ్మ సెంటర్‌వద్ద నిరసన తెలియజేసి కోతిబొమ్మలకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ భాజపా అధ్యక్షులు ఆకుల సతీష్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రధాన రహదారులు అన్ని గుంతలమయంగా మారి కనీసం వాహనాలు, మనుషులు నడవడానికి ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు సుమారుగా ఒక్కో డివిజన్ రూ,15నుండి20లక్షల వరకు రోడ్ల మరమ్మతుల కోసం కేటాయించిన సమస్య పరిష్కారాం కాకపోవడం బిఆర్ఎస్ నాయకుల పాలనకు అద్దం పడుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఏడాదిలోనే పాడవుతున్నాయి. 25శాతం కమీషన్లు తీసుకోవడం వల్ల గుత్తేదారులు నాణ్యత పాటించకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, డా. రాజు, చంద్రమౌళి, చెన్నారెడ్డి, సత్యనారాయణ, శేషారావు, కౌశిక్‌నాయుడు, సతీష్, రాము, మాధవరావు, కృష్ణారెడ్డి, కుమార్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

### టిపిసిసి ప్రధాన కార్యదర్శిని కలిసిన జెమ్మి దేవేందర్

**పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్ శనివారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నశివారెడ్డిని ఆమె కార్యాలయంలో మార్యదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ దేవేందర్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాసేవ కోసం పరితపించేవారు కాంగ్రెస్‌లో పార్టీలో ఉంటారని ప్రజల్ని దోచుకునేవారు బిఆర్ఎస్‌లో ఉంటారన్నారు. కాంగ్రెస్ సైనికులు అందరం సమన్వయంతో పనిచేయాలని రాబోయేది మన ప్రభుత్వమే అన్నారు. బిఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలు, దోపడి ప్రజల్లోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోమే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో కెఎంసి అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్, ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జెమ్మి దేవేందర్‌ను సత్కరిస్తున్న జ్యోత్స్నశివారెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

## 4 వ తేదీ నుంచి ఎల్‌బి స్టేడియంలో కుస్తీ పోటీలు

**సైఫాబాద్, సెప్టెంబరు 30ప్రభాతవార్త:** భారత్ వ్యాయామశాల స్పోర్ట్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియంలో ప్రధాన మంత్రి నరే ంద్రమోదీ కేసరి కుస్తి పోటీలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ తెలిపింది. ఈమేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ట్రస్ట్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొర్ల సాయిరాం యాదవ్, బిజెపి నాయకులు పిట్టల చంద్రశేఖర్, కొంపల్లి అరవింద్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ 3వ తేదీన క్రీడాకారులకు శారీరక పరీక్షలు జరుగుతాయని, 4వ తేదీ ఉదయం నుంచి పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. నరేంద్రమోదీ దేశాభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున ్న కృషికి తాను అకర్షితులై ఈ పోటీలను నిర్వహించాలని గత ఆరు నెలలుగా ఎంతో కష్టపడి పోటీలను నిర వ్రాహణకు కృషి చేయడం జరిగిందని సాయిరాం యాదవ్ తెలిపారు. మూడు విభాగాల్లో 4, 5, 6 తేదీలలో పోటీలను నిర్వహిస్తున్నామని, 6వ తేదీ సాయంత్రం విజేతలకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నగదు బహుమతులు ప్రధానం చేస్తారని

## పిల్లలకు న్యాయసేవలు సంరక్షణ పథకాల అమలు

**మెట్రోపాలిటన్ సెషన్స్‌జడ్జి ప్రేమావతి**



అనాథపిల్లలకు ఆధార్‌కార్డులు, దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

**నాంపల్లి, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పిల్లల స్నేహపూర్వక న్యాయసేవలు, సంరక్షణ పథకం, నెలవారీ కార్యక్రమంలో భాగంగా శనివారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ అనాథ శిశుగృహాన్ని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అధ్యక్షు రాలు ఎస్.ప్రేమావతి సందర్శించి అక్కడ ఉంటున్న శిశువుల వివరాలను, వారికందించే సౌకర్యాల గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారాలీగల్ వాలంటీర్లు షేక్ ఇష్టేకార్, ఉత్తమ్ ఉచితంగా అంద జేసిన 40 దుప్పట్లను, అంతేకాక హోంలోని అనాథ పిల్లలకు జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ కృషితో ఆధార్ కార్డులు, సదరం సర్టిఫికెట్లు అందజేసి ప్రేమావతి మాట్లాడుతూ ఆధార్ కార్డులు అందజేసినందుకు జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిని, రైన్‌బో హాస్పిటల్ వైద్యులు వైద్యశిబిరం నిర్వ హించి సందరం సర్టిఫికెట్లు త్వరతిగతిన ఇప్పించినందుకు డాక్టర్ సోమేశ్వర రావు కృషిని శ్లాఘించారు. క్రమశిక్షణతో పిల్లలకు చూస్తున్నందుకు సిబ్బం దిని అభినందిస్తూ వారికి ఏమైనా సమస్యలుంటే హైదరాబాద్ మెట్రోపా లిటన్ లీగల్ సర్వీసెస్ కార్యదర్శి రాధిక జైశ్వాల్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రాధిక జైశ్వాల్, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, తహసీల్దార్ శ్రీరాములు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శైలజ, మధురానగర్ పోలీసు అధికారులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ఘనత కేసీఆర్‌దే

**టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా**



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, ముఠా గోపాల్

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. శనివారం దోమల గూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో తెలంగాణ గ్రామీణ క్రికెట్ అసో సియేషన్ బోర్డు మెంబర్స్ స్టేట్ లెవల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సదర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని, తాము ఎంచుకున్న క్రీడలలో రాణించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 1 వరకు స్టేట్ లెవెల్ క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని, ఈ పోటీలలో పది టీంలు పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భువనేశ్వరి, సాయి, క్రీడాకా రులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## కెసిఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి: ఎమ్మెల్సీ

**నిజాంపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, నిజాంపేట మున్సి పల్ కార్పొరేషన్ పరిధి డబుల్‌బెడ్‌రూమ్‌ల సమీ పంలో నూతనంగా నిర్మించనున్న బంజారా సేవాలాల్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమిపూజ చేశారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం లోని అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, నాయకులు, బంజారా సేవాలాల్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కౌన్సిలర్

**దుండిగల్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** దుండిగల్ మున్సి పాలిటీ పరిధి భౌరంపేటలో స్వచ్ఛతహైసేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఒక గంట పరిశుభ్రత కార్యక్రమంలో కౌన్సి లర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పాఠశాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అనేక రకమైన వ్యాధుల భారీన పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా బావించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, యేసయ్య, ప్రదీప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నాగరాజు, నాని, మున్సి పల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ప్రైడ్ ఆఫ నేషనల్ అవార్డ్-2023 సదరన్ ఇండియాలో విజయసాధకులకు తెలంగాణ, పుదుచ్చరి గవర్నర్ తమిళసై చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న హనుమంతరావు పసుపులేటి

# ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సిని మాటోగ్రాఫీ శాఖల మంత్రి తలససాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 300 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 80 మంది ముస్లింలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక ససహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం సిఎం కేసిఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత క్రిస్మస్. రంజాన్ పండగలను ప్రభుత్వ అధ్వర ్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో గిఫ్ట్‌ప్యాకెట్లను ప్రభుత్వం అందజేస్తుందని గుర్తు చేశారు.

ఈ కార ్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ జిల్లా అధికారి హెలియాస్ అహ్మద్, కారో ్పరేటర్లు హేమలత, కొలను లక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, అత్తెల్లి అరుణగౌడ్, శేషుకుమారి, కిరణ్మయి, నాయకులు ఖలీల్, అఖీల్, ఫహీం, అబ్బాస్, జహింగీర్, బిఆర్‌ఎస్ నేతలు ఆకుల హరికృష్ణ, స్కైలాబ్‌యాదవ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** ఆర్య వైశ్యుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి, వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేసించి ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు పేరుకే అగ్రవర్ణం కానీ తెలంగాణలో ఉన్న ఆరు శాతం ఆర్యవైశ్యులలో దాదాపు ఎనభైశాతం మంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీ ప్రకారం అక్టోబర్ పదిలోగా ఆర్యవైశ్య కార్పొరేషన్‌పై ప్రకటన చేయాలని, లేనిపక్షం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరన రూపొందించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఆర్యవైశ్యులకు అన్ని రాజకీయపార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ఆర్యవైశ్యులు ప్రతి నియోజకవర్గంలో 30వేల వరకు ఉన్నారు కాబట్టి గెలుపు ఓటములను శాసించే సత్తా ఉందని స్పష్టం చేశారు. అనాదిగా ఆర్యవైశ్యులు అగ్రవర్ణానికి చెందిన వారు కావటంతో వారు ఎటువంటి ప్రభుత్వ పథకాలకు నోచుకోలేకపోతున్నారని, ప్రత్యేక కార్పొరేషన్‌తో ఆర్యవైశ్య సామాజిక వర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేఅవకాశం ఉటుందని అన్నారు. ఈ దీక్షా కార్యక్రమంలో చికోటి ప్రవీణ్ తెలంగాన ఆర్యవైశ్య మహాసభ నాయకులు రేణికుంట్ల గణేష్ గుప్తా, కొండ్లె మల్లిఖార్జున్, మహాసభ మీడియా సెల్ చైర్మన్ రాచమల్ల వెంకటేశ్వర్లు, ఊర లక్ష్మణ్, ఆగిరి వెంకటేష్, మొగుల్ల పల్లి ఉపేందర్, ఇరుకుల రామకృష్ణ, సామ్రాజ్యలక్ష్మి, ఉప్పుల శారద, మారిశెట్టి అనంతరాములు మరియు వివిధ జిల్లాల నుండి ఆర్యవైశ్య సంఘాల నేతలు పాల్గొన్నారు.

**సాధనదీక్షలో ఉద్రిక్తత:** ఆర్యవైశ్యమహాసభ సాధన దీక్షలో సికింద్రాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత, ఆర్యవైశ్య నాయకుడు సాయి ప్రసంగాలకు అడ్డురావటంతో కొద్దిసేపు తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. అక్కడేఉన్న పోలీసులు జోక్యం చేసుకుని సాయిని పక్కకు తీసుకువెళ్లటంతో కొద్దిసేపటికి గొడవ సద్దుమణిగి, పరిస్థితి సాధరణ స్థితికి వచ్చింది.




## ఇస్సో నేషనల్ గేమ్స్-2023 షురూ

**87 పాఠశాలల నుంచి 622 మంది విద్యార్థులు హాజరు**

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభావార్త:** ఇస్సో నేషనల్ గేమ్స్ 2023 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈమేరకు శనివారం దగాడియం స్కూల్‌లో ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈగేమ్స్‌లో మొత్తం 87 ఇంటర్నేషనల్స్ స్కూళ్లనుంచి 622మంది విద్యార్థులు తమ అద్భుతమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించనున్నారు. ఈఏడాది బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ ఈవెంటన్లకు గాడియం ఆతిథ్యం ఇస్తుంది. ఈ పోటీలు సెప్టెంబరు 29 నుంచి అక్టోబర్ 2వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా గాడియం స్కూల్ వ్యవస్థాపకురాలు డైరెక్టర్ కీర్తిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థ ఎప్పటి నుంచో ఆటపాటలకు ప్రోత్సహం ఇస్తుందన్నారు. గాడియం స్పోర్టోపియా అనేది విద్యాపరమైన విజయాలకు సమాంతరంగా క్రీడా విజయాలను కూడా పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. ఇలా పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆమెతోపాటు ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్ ప్రియాన్షు రజావత్, ప్రముఖ అథ్లెట్ కావ్యా గుప్తా, ప్రపంచ కప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్య విజేత అరుణాబుద్దారెడ్డి, బంగారు పథక విజేత ప్రవీణ్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ఎగ్జిబిషన్ నూతన కమిటీ

**అప్జల్‌గంజ్, సెప్టెంబర్ 30ప్రభాతవార్త:** అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ఎగ్జిబిషన్ నూతన కమిటి ఎన్నికయ్యారు. ఈ మేరకు51 రామాయణ మేళా కమిటి ఛీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి, కోశాధికారి గిరిధర్‌లాల్‌డగా ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నూతన కమిటి వైస్ చైర్మన్ సత్యేంద్ర, బి.హన్‌మంత్‌రావు, చంద్ర జిత్‌సింగ్, కోశాధికారి రాజేంద్రకుమార్, మేనేజింగ్ కమిటి సభ్యులు అశ్వాక్ హైదర్, రాజేశ్వర్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, మహ్మద్‌ఫహీముద్దీన్, అమర్జీత్ రెడ్డి, ఆనంద్‌కుమార్‌లను శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో మనోజ్‌జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ర్యాలీని ప్రారంభించిన మాజీ నగర పోలీస్ కమిషనర్

**అప్జల్‌గంజ్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మంచి ఆలోచనలు, మంచి అలవాట్లు సహృదయంతో అందరు ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని కోరిక ప్రతి ఒకరిలో ఉన్నపుడే వారి హృదయాలకు మేలు జరుగుతుందని మాజీ నగర పోలీస్ కమీషనర్ ఎ.కె.ఖాన్‌అన్నారు. నాంపల్లిలోని కేర్ ఆసుపత్రిలో బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి అధికారి సయ్యద్ క్మాన్‌హుస్సే న్‌లు, వైద్యులు నిర్మల్‌కుమార్, అమన్‌సల్వాన్, రామకృష్ణ, కె.వి.రాజశేఖర్, ఉషారాణి, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మిలాద్ బి నబీ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 30ప్రభాతవార్త:** కుల మతాలకు అతీతకంగా మిలాద్ బి-నబీ పండుగకు సహకరించాలని అబిడ్స్ సరి ్కల్ ఇన్‌స్పెక్టర్ టి.నర్సి ంహా రాజు కోరారు. ఈ మేరకు పీస్ కమిటి, మైత్రి కమిటి సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి ఎంతో చరిత్ర ఉందని, ఇక్కడ భిన్న సంస్కృతులకు నిలయమన్నారు. ముఖ్యంగా ఆదివారం నిర్వహించే మిలాద్-బి-నబీ పండుగ సందర్భంగా నిర్వహించే ర్యాలీ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకుగాను అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సెక్టార్ ఎస్.ఐ సుమన్‌కుమార్, మైత్రి, పీస్ కమిటిసభ్యులు పాల్గొన్నారు.

## మోతమోగిద్దాం చంద్రబాబును కాపాడుకుందాం

**ధర్నాచౌక్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసిస్తూ చంద్రబాబుకు మద్దతుగా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు తెలంగాణ టిడిపి అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపుమేరకు శనివారం సాయంత్రం ఏడు గంటల నుంచి ఏడు గంటల ఐదు నిమిషాల పాటు సిఎం జగన్‌కు వినిపించేలా 'మోతమోగిద్దాం' కార్యక్రమాన్ని టిడిపి సికింద్రాబాద్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. 'మోతమోగిద్దాం చంద్రబాబును కాపాడుకుందాం' నినాదంతో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఈ కార్యక్రమం విజయవంతమైంది. పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ కేసులో ఇరికించి పలు విధాలుగా ఆయనను ఇబ్బందులకుగురిచేస్తున్నారని, ఆయన వయసును కూడా పరిగణలోకి తీసుకోకుండా, ఆయన చేసిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం రాజకీయ కక్షతో ఆయనను ఏ విధంగానైనా అణిచివేయాలనే దుర్బుద్ధితో జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కుట్రలో భాగమే ఇది అని అన్నారు. దేశం, రాష్ట్రం, ప్రపంచమంతా అక్రమ అరెస్టుకు నిరసన తెలియజేస్తున్న కనీసం చలించకుండా జగన్మోహన్‌రెడ్డి మొండిగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధానకార్యదర్శి పి.బాల్‌రాజ్‌గౌడ్, కట్ట రాములు, చంద్రమోహన్ గౌడ్, సొన్నాకుల ప్రకాశ్, భవానీ శ్రీనివాస్, వైఎల్.నర్సింహాగౌడ్, రవిగౌడ్, సత్తన్న, యాదగిరి, సుధాకర్, రాజ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు డబుల్ ఇంటిని అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే...మంత్రి

**బేగంపేట సెప్టెంబరు 30,ప్రభాతవార్త :** పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అందిస్తున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బేగంపేట పాటిగడ్డలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలులో 3వ విడత ఆన్ లైన్ డ్రాలో ఎంపికైన డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్దిదారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో గొప్పగా సొంత ఇంటిలో ఆత్మ గౌరవంతో జీవించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంకల్పం మేరకు ప్రభుత్వం రూ. 9600కోట్ల వ్యయంతో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేపట్టిందని వివరించారు .ఎవరూ అడగకుండానే ముఖ్యమంత్రి గొప్ప మనసుతో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమం సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని ఐడీహెచ్ కాలనీలోనే ప్రారంభమైందని చెప్పారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాల్లో ఈ డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 2బెడ్ రూమ్‌లు, కిచెన్, 2 బాత్రూమ్‌లతో పాటు విద్యుత్, రోడ్ల నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. లబ్దిదారుడిపై ఒక్క రూపాయి భారం పడకుండా ఉచితంగా ఇండ్లను అందజేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న చరిత్ర రాష్ట్ర ప్రభుత్వానిదే"ని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.8.60లక్షల ఖర్చుచేస్తుందని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంతో పారదర్శకంగా రాజకీయ జోక్యం లేకుండా అందిస్తున్నట్లు వివరించారు. మొదటి విడతలో 11,700మందికి 13,200మందికి ఇండ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. 3వ విడతలో నిర్వహించిన డ్రాలో 36,884మందిని ఎంపిక చేయడం జరిగిందని వీరికి అక్టోబరు 2,5తేదీలలో ఇండ్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో పేదల కోసం ఇండ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ప్రభుత్వం కేవలం 30శాతం మాత్రమే ఆర్థిక సహాయం అందించేదని, ఇండ్లు కూడ ఎంతో ఇరుకుగా ఉండేవని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసంన తెలంగాణా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని లబ్దిదారులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్, డిపోచంపల్లి, నిజాంపేట లలో అక్టోబరు 2,5వతేదీన మిగిలిన వారికి ఇండ్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. లబ్దిదారులకు కేటాయించే ఇళ్ల వద్దకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి తీసికెళ్లనున్నట్లు మంత్రి తెలయజేసారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి, కొలను లక్ష్మి, హేమలత, మాజీ కార్పొరేటర్లు, ఉప్పల తరుణి నాయి. అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రూపా నాయకులు టి.శ్రీహరి, డి.వి.నరేందర్‌రావు నాయి. శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడను అభివృద్ధిలో జిల్లాలోనే అగ్రగామిగా మారుస్తున్నాం

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

**నార్సి ంగి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో రంగారెడ్డి జిల్లాలోనే అగ్రగామిగా మారుస్తున్నామని రాజేంద్ర నగర్ శాసన సభ్యులు టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 12.వ,వార్డు నుంచి 22.వ,వార్డు వరకు 18. ప్రాంతాలలో రూ.6.కోట్ల 51.లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజి, సీసీ రోడ్లకు అభివృద్ది పనులకు మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని పూర్తి చేశానని తెలిపారు. ప్రధాన సమస్యగా ఉన్న మంచినీటి ఇబ్బందిని శాశ్వతంగా పరిష్కరించి మాట నిలుపుకున్నామని పేర్కొన్నారు. సమైక్య పాలనలో సంక్రాంతి పర్వదినం నుంచే మహిళలు బిందెలు పట్టుకొని ధర్నాలు చేసే వారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. సీఎం కేసిఆర్ దూరదృష్టితో ఆలోచించి కృష్ణా, గోదావరి నదుల నీటిని భారీ పైప్‌లైన్ల ద్వారా తీసుకువచ్చి రాష్ట్రప్రజలందరికి మిషన్ భగీరథ ద్వారా నల్లాల్లో సరఫరా చేయిస్తున్నారన్నారు. ఇప్పుడు భూగర్భ డ్రైనేజి సమస్యను కూడా శాశ్వతంగా పరిష్కరించేందుకు బారీ ప్రణాళికలు రూపొందించామని, క్రమ పద్ధతిలో ముందడుగు వేస్తున్నామని వివరించారు. ప్రజల ఇబ్బందులను దూరంచేసే ప్రజా ప్రతినిధులనే ప్రజలు గుర్తించి ఎన్నికలలో గెలిపించుకుంటారని, అలాగే మూడు సార్లు విజయం సాధించానని, ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో సైతం నన్నే ప్రజలు ఆశీర్వదిస్తారని ప్రకాశ్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, సహకార సంఘం అధ్యక్షులు రాందాస్ ముదిరాజ్, బిఆర్‌ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, పద్మావతి పాపయ్య, భూపాల్‌గౌడ్, అస్లాం, రాము, మాలతీ నాగరాజు, ఆసియా ఖాజా, పుష్పమ్మ శ్రీనివాస్, శ్రీలత సురేష్గౌడ్, సాగర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు మలాకి రత్నం, సీనియర్ నేతలు గోపాల్, టింకు, రజాక్, రాజిరెడ్డి, పాండు, మల్లేష్ యాదవ్, సుందర్‌గౌడ్, అంతారం నరేష్, సంపత్, శ్యాంలెట్ రాజు, సుమన్‌గౌడ్, రాజు, సాయి బాబా, వెంకటేష్, రాజు నాయక్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బైరి వెంకటేశం మోచి, నిరుగొండ బుచ్చన్న

## 4న కంటోన్మెంట్‌లో 'ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభ'

**హాజరుకానున్న ప్రకాశ్ అంబేడ్కర్, సోనేరామ్ భీమ్**

**హైదరాబాద్, సెప్టెంబరు 30,ప్రభాతవార్త:** ఎస్సీ57 ఉపకులాల సాధన కోసం అక్టోబర్ 4న జరిగే ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ, ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆత్మగౌరవ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లోని దోభిఘాట్ గ్రౌండ్‌లో జరిగే ఈసభకు ముఖ్యఅతిధిగా అంబేడ్కర్ మనువడు ప్రకాశ్ అంబేడ్కర్, గౌరవఅతిధిగా కొమరం భీం మనువడు సోనేరావ్ భీమ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్సీ ఉపకులాల చరిత్రలో మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈసభకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నిరగొండ బుచ్చన్న గోసంగి, రాయిల లక్ష్మీ నర్సయ్య చిందు, ఎన్ స్వామి మిత అయ్యాల్వార్, డి రంగన్న, తులసీదాస్ గైక్వాడ్ మాంగ్ పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి : కొంతం దీపిక

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని మారేడ్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లల్లో స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఫ్లాట్లు కేటాయించాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. మారేడ్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలో స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు ఫ్లాట్లు కెటాయించడంలో మంత్రి తలసాని అడ్డుకుంటున్నందుకు నిరసిస్తూ శనివారం 2వ రోజు లబ్ధిదారులు ఇండ్ల వద్ద ఆందోళన చేసుస్తున్నందుకు మోండా డివిజన్ కార్పోరేటర్ వారికి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ మారేడ్‌పల్లిలో 462 ఇండ్లు నిర్మించారని, అందులో పస్ట్ లిస్ట్‌లోని 232 మందికి మాత్రమే కెటాయించడం జరిగిందన్నారు. 2వ లిస్ట్‌లో 144 మందితో పాటు మరో 15 మంది ఓనర్లు ఉన్నారని, వారికి 2 బిహెచ్‌కె ఫ్లాట్లను కెటాయించడంలో మంత్రి తలసాని అడ్డుకోవడం సరైంది కాదన్నారు. 2 బిహెచ్‌కె ఇండ్ల నిర్మాణం కోసనం తమ ఇండ్లు ఖాళీ చేసేసే సమయంలో రెవెన్యూ అధికారులు గుర్తించిన జాబితా ప్రకారం ఇండ్లు కేటాయించాలన్నారు. కంటోన్మెంట్‌లో మంత్రి తలసాని పెత్తనం చేయడం సరైంది కాదన్నారు. ఏమైనా లావాదేవీలు ఉంటే ఆయన నియోజకవర్గంలో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక లబ్ధిదారులు సురవి వాసురెడ్డి, రాజ్‌గోపాల్, సదానంద్ గౌడ్, పిట్ల నాగేశ్, మహేందర్ రెడ్డి, రఘు, శ్రీను, బషీర్, లావణ్య, లక్ష్మి, పిట్ల మనిలక్ష్మి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సాహితీవేత్త వెంకటరత్నంకు హనుమజ్జానకీ రామశర్మ సాహితీ పురస్కారం

**నాంపల్లి, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు తమ గురువు, నెల్లూరు వెంకటగిరిరాజు కళాశాల తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు పోలూరి హనుమజ్జానకీ రామశర్మ స్మారకార్థం తెలంగాణ సారస్వత పరిషత్తులో నెలకొల్పిన సాహితీ పురస్కారాన్ని ఈ సంవత్సరానికిగాను ప్రముఖ సాహితీవేత్త గుంజి వెంకటరత్నంకు ప్రదానం చేయాలని సారస్వత పరిషత్తు నిర్ణయించినట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. జుర్రు చెన్నయ్యలు శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో అక్టోబరు 13 సాయంత్రం 5.30 జరిగే ప్రత్యేక కార్యక్రమం లో ప్రముఖ అతిథుల చేతులమీదుగా సాహితీ పురస్కారంతోపాటు 25వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రదానం చేయనున్నట్లు పేర్కొ న్నారు. ఈ సందర్భంగా పోలూరి వెంకట కుసుమ హరప్రసాదరావు రచించిన పోలూరి హనుమజ్జానకీ రామశర్మ జీవితం, సాహిత్య పరిచయం గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. ప్రముఖ సాహితీవేత్తలు డా. రేవూరి అనంత పద్మనాభరావు, గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అధికసంఖ్యలో సాహితీ ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసన

**-మోత మోగిద్దాం నిరసనలో పాల్గొన్న టిడిపి నేతలు**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఏడు గంటల ఐదు నిమిషాల వరకు 'మోత మోగిద్దాం' కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ రాష్ట్రనాయకులు ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆ కార్యక్రమం జరిగిందది. డివిజన్ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్యాల సత్యనారాయణ, అల్వాల్ శివకుమార్, సంజీవరెడ్డి, ఆరే కృష్ణ, వేణు, ఆనంద్, కట్టయాదగిరి, ఏడ ధనం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబుతో పాటు ప్రజలందరికి న్యాయం జరగాలనే ఈ కార్యక్రమానికి పార్టీ పిలుపునిచ్చిందని, చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చి ప్రజలకు సేవ చేస్తారని, న్యాయం తప్పకుండా గెలుస్తుందని, చంద్రబాబుకే కాదు ఉభయ తెలుగు రాష్ట్రప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## నేత్రపర్వంగా రథోత్సవం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:**

ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లోని పవిత్రమైన శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో జరుగుతున్న నవరాత్రోత్స వాల ముగింపు సందర్భంగా శనివారం స్వామివారి రథోత్స వ ఊరేగింపు కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేత్రపర్వంగా సాగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీనాథ్‌శర్మ, గోపాలాచార్యులు, భవానీ ఆచార్యులు, రామాచార్యులు, జగన్మోహనాచార్యులు, ధర్ మకర్తలు ఎఎస్‌వి. రమణమూర్తి, సి.వెంకట గోవిందరావు, ఓ.మోహన్ రావు, డాక్టర్ ఎన్.వెంకట రమణారావు, పి.అరుణశ్రీ, కె.స్వరూప, బి.శివకుమారి, సిహెచ్.రాజాశ్రీనివాస్, ఎ.దశరథ్, కె.హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **SUNKARA CHAITANYA SAI KIRAN,** S/o S. Surya Prakash Rao, H.No.21-57, V.V. Nagar, Near Bus Stop, Hyderabad-60 (Aadhar Card No. 4794 8903 0040) was in custody of the Original Sale Deed bearing document No.7434/1999 dated 21.12.1999 at S.R.O. Pedda Amberpet, R.R.District lost on 23.09.2023, while in transit from V.V. Nagar to Saroornagar X Roads and not traceable to their best efforts, to that effect also wants to lodge a complaint before the Police Officials. This document pertains to the Plot No.328, Sri Lakshmi Enclave, Lashkarguda, Surmaiguda (V), Hayathnagar Mandal, R.R.Dist.

If any person or persons, found the same, receiving or dealing with the said original sale deed doc. No. 7434/1999 dated 21.12.1999, would do so at their own risk and responsibility and my client will not be liable in any manner, what so ever for any loss incurred on account of any such dealing. In the event no information is received by the under signed within seven days from the date hereof. Hereby I request the finder of the said document to inform the below mentioned person.

**Sd/- M/s. P. Venkata Subba Rao**
**Advocate**
Off: H.No.1-2-17, Marutinagar, Kothapet, Hyderabad-102
**(M): 9177670836, 9391013262.**

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నం. 27/EE/సర్కిల్ నం-17/KZ/GHMC/2023-24 తేది: 29.09.2023.
పనిపేరు: సివిల్ పనులు (10నంబలు) అంచనా మొత్తం/ECV : రూ. 269.50 లక్షలు. డౌన్‌లోడ్ ప్రారంభ/ముగింపు తేదీలు, సమయం : క్ర.సం. నం.01 నుండి 10 పనుల కొరకు: 30.09.2023 మ.12.00గం. నుండి 03-10-2023 మ.12.00గం. వరకు మాత్రమే. అధికారి పేరు, చిరునామా : EE, సర్కిల్-17, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఇ-మెయిల్ చిరునామా : ee17.ghmc@gmail.com మొబైల్ నం: 7337557246.
DIPR.No.7461-PP/CL/Advt/1/2023-24 తేదీ: 30.09.2023 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, KZ, GHMC.

## డబ్బులు ఇచ్చామని సాక్ష్యాలుంటే మహేశ్వరం శివగంగ ఆలయానికి రావాలి : పారిజాత



కొత్త మనోహర్‌రెడ్డికి సవాల్ విసురుతున్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్ విషయంలో తాము టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి డబ్బులు ఇచ్చినట్లు అసత్య ఆరోపణలు చేసిన కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి తన వద్ద ఏదైనా ఆధారాలు ఉంటే ఆదివారం ఉదయం 9.30 గంటలకు మహేశ్వరం శివగంగ ఆలయం వద్దనే ఉంటామని వచ్చి నిరూపించాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సవాల్ చేశారు. శనివారం మల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై బురద జల్లే విధంగా మనోహర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. ఆయన చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. రేవంత్‌పై మనోహర్‌రెడ్డి విమర్శలు చేయడం యావత్ తెలంగాణ కాంగ్రెస్ కుటుంబాన్ని అవమానపరచడమేనని ఆమె తెలిపారు. ఇటీవల తుక్కుగూడ విజయభేరి సభ విజయవంతం కావడంతో ప్రత్యర్థి పార్టీలకు భయం పట్టుకుందని ఆమె పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేసిన మనోహర్‌రెడ్డి తమ సవాల్‌ను స్వీకరించి రావాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నేనావత్ బాలు నాయక్, బండారి మనోహర్, నాయకులు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, తూళ్ళ నరహరిగౌడ్, నీరుడు శ్రీరాములు, ఇక్కె శ్రీనివాస్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తమ భూములు తమకే దక్కేటట్లు చూడాలని ఆర్డీఓకు దళితుల వినతి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడ సర్వే నెంబర్‌లో తమ భూముల విషయంలో తమకు న్యాయం చేయాలని గత 63 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న భూబాధిత దళితులు కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ను కోరారు. శనివారం వారు దళిత నాయకుడు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్డీవోను కలిసి వినతి పత్రం సమర్పించి తమ ఆవేదనను వివరించారు. తమ భూములు తమకే దక్కే విధంగా చూడాలని వారు ముక్తకంఠంతో కోరారు. ఈ కార్యక్రమంలో కర్రె రమేష్, రొడ్ల అంజమ్మ, పుట్టగళ్ళ అండాలు, కర్రె లక్ష్మమ్మ, కర్రె ముత్యాలయ్య, రొడ్డ సత్తయ్య, గుడ్ల మహేందర్, గుడ్ల రాములు, పుట్టగళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో బండ్లగూడ ఖాల్సా సొసైటీ అభివృద్ధి : మేయర్ పారిజాత



ప్రసంగిస్తున్న సొసైటీ ఛైర్మన్ పెంటారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** అందరి సహకారం వల్లే బాలాపూర్ కేంద్రంగా పని చేస్తున్న బండ్లగూడ ఖాల్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి పథంలో ముందుందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సొసైటీ అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి అధ్యక్షతన జరిగిన సంఘం 47వ వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గం మార్గదర్శకంగా ముందుండి అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ ఛైర్మన్ పెంటారెడ్డి మాట్లాడుతూ ఖాతాదారులు, మహిళా గ్రూపులు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ పని చేస్తుందని స్పష్టం చేశారు. అంతకు ముందు సిఇఓ ఎర్ర జైహింద్ సొసైటీ వార్షిక నివేదిక సభకు చదివి వినిపించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కళ్లెం లక్ష్మారెడ్డి, నీరుడు నర్సమ్మ, రావుల లింగం, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ బిఆర్‌ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడిగా రవి ముదిరాజ్ నియామకం



రవి ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన రవి ముదిరాజ్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం రవి ముదిరాజ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. రవి ప్రస్తుతం చంపాపేట బిఆర్‌ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మరెక్కడా లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గం అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో మరోసారి బిఆర్‌ఎస్ విజయఢంకా మోగించనుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, ఓరుగంటి వెంకటేషం, ముడుపు రాజిరెడ్డి, ఉమా మహేశ్వర్, గోగిరెడ్డి అంజిరెడ్డి, మేక సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, ప్రభాకర్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 2.20 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



సురేందర్‌రెడ్డికి లడ్డూను అందజేస్తున్న సామ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారంలోని మహేందర్‌రెడ్డి యూత్ అసోసియేషన్ గణపతి మండపం వద్ద నిర్వాహకులు, సీనియర్ నాయకుడు సామ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్ లడ్డూ వేలం ప్రక్రియ నిర్వహించగా తుర్కయాంజాల్‌కు చెందిన వ్యాపారవేత్త కందల అమరేందర్ రెడ్డి అందరికంటే ఎక్కువగా రూ. 2.20 లక్షలు వేలం పాట పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అమరేందర్‌రెడ్డి లడ్డూను దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గణనాథుడిని మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో కృష్ణయాదవ్, మనోహర్‌రెడ్డి, మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు చేపట్టాలని వినతి : జ్యోష్ణ




జడ్‌సి పంకజకు వినతి పత్రం అందజేస్తున్న గంధం జ్యోష్ణ తదితరులు

**రామంతాపూర్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్ పనులు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణనాగేశ్వర్‌రావు జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ వివేక్‌నగర్ ప్రధాన రహదారినుంచి కృష్ణవేణి స్కూల్‌వరకు సిసి రోడ్డు వేయాలని, దోభీఘాట్ నుంచి రాజేంద్రనగర్ వరకు సిసిరోడ్డు వేయాలని కోరారు. రాంశంకర్‌నగర్, ఈస్ట్ శ్రీనివాసపురంలో వరదనీటి కాలువ నిర్మించాలని కోరారు. భరత్‌నగర్‌లో మనస్వి స్టోర్ నుంచి బేకరి వరకు విడిసిసి రోడ్డు వేయాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ పంకజ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం కృషి : మర్రి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ఈస్ట్‌ఆనంద్‌బాగ్‌లో మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగ్ రావు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అదేవిధంగా నాయకులు, కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. తాను కూడా పార్టీ శ్రేణులకు స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేశ్, బద్దం పరశురాంరెడ్డి, ఆకుల వంశీకృష్ణ, మహిళా ప్రెసిడెంట్ కవిత, వైస్ ప్రెసిడెంట్ గీత గుప్త తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల పూజలందుకుంటున్న గణనాధుడు



గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** చంపాపేటడివిజన్ ఎస్‌వి కాలనీలోని గణనాధుడు భక్తుల పూజలందుకుంటున్నారు. గణనాదుడికి శనివారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, రోజారెడ్డి, వసంత, మధుసూధన్‌రెడ్డి, జంగయ్య, గౌతంరెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమాన్ని గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సామ

**మన్సూరాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చిన్న చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరోపక్క అభివృద్ధి అంటూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి దుయ్యబట్టారు. ఎల్బీనగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధిని గాలికి వదిలేసి మాయమాటలతో ఓట్ల కోసం బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేయటం సిగ్గుచేటన్నారు. గ్రేటర్ పరిధిలో కాంట్రాక్టర్లకు వెయ్యి కోట్ల బకాయిలున్నాయని వారికి బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభివృద్ధిపేరుతో శంకుస్థాపనలు చేయడం కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు పరిపాటిగా మారిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే తప్పుడు జీవోలు తీసుకొచ్చి ప్రజలను మోసం చేస్తున్న ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్ కుమార్ కృష్ణంరాజులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో మేరా దేశ్.. మేరా మట్టి కార్యక్రమం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో శనివారం బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో మేరా దేశ్.. మేరా మట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డిలు హాజరై దేశం కోసం అమర జవాన్ల స్మారకార్థం ఢిల్లీలో ఏర్పాటు చేస్తున్న స్థూపం నిర్మాణం కోసం మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా వారు వివిధ కాలనీల్లో పర్యటించి ప్రధాని మోడి పిలుపు మేరకు మట్టిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పస్నూరి బిక్షపతిచారి, పెండ్యాల శివపార్వతి నర్సింహ, నాయకులు మద్ది రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి యాదవ్, సూల ప్రభాకర్, గాజుల మధు, బెల్లకొండ నాగరాజు, నాగేశ్, విక్కీ సాగర్, రమేష్ ముదిరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అక్టోబర్ 1న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం

**తుర్కయంజాల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హీసేవ శ్రమ దానం కార్యక్రమం అక్టోబర్ 1న ఉదయం 10గంటలకు గంటపాటు నిర్వహిస్తున్నట్లు తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీలోని ప్రతివార్డులో రెండు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజా ప్రతినిధులు, కౌన్సిల్, ప్రజల భాగస్వామ్యం తప్పక హాజరు కావాలని తెలిపారు. రోడ్లు, చెత్త శుభ్రం చేయడం, పొదల తొలగింపు, డ్రైనేజీ శుభ్రపర్చడంతోపాటు పరిసరాలను శుభ్రపర్చి బ్లీచింగ్ చల్లడం, ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాలు, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచటంవంటి స్వచ్ఛత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పారిశుధ్య అధికారి ప్రవీణ్‌కుమార్, జవాన్లు పాల్గొన్నారు.

## రూ.66లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్లు : ఎమ్మెల్యే బేతి



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ చేతన

**ఉప్పల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడ డివిజన్‌లో రూ.66లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హబ్సిగూడ రవీంద్రనగర్‌లో కొత్తగా 300 ఎంఎం డయా పనులు చేపడుతున్నామని తెలిపారు. అదే విధంగా స్ట్రీట్‌నెం. 5, 6లో డ్రైనేజీ వ్యవస్థ అధునీకరణకు కొత్త పనులు చేపడుతున్నామన్నారు. గతంలో ఉన్న పురాతన పైప్‌లైన్లు తొలగించి కొత్త పైప్‌లైన్లు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ అసిఫ్‌అలీ, నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, వి.గోపాల్‌రెడ్డి, వి.సంతోష్‌రెడ్డి, గాయం శ్రీధర్‌రెడ్డి, పాపయ్య, మారయ్య, శివ, శ్రీధర్, పరమేష్, సంజయ్‌పటేల్, కాలనీ నేతలు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** ఓఆర్ఆర్ ఫేజ్ -2 పనుల్లో భాగంగా జలమండలి ఆధ్వర్యంలో రూ.60 కోట్ల వ్యయంతో చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఓఆర్ఆర్ ఫేజ్ -2లో భాగంగా డివిజన్ పరిధిలో లోప్రెషర్ తక్కువ ఉన్న ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లు వేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కార్యదర్శి కె.జగన్, బింగి శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, నారాయణరెడ్డి, హనీష్, సుందర్; శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.55 లక్షలు పలికిన ఓల్డ్ బాలాజీనగర్ గణేష్ లడ్డూ

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓల్డ్ బాలాజీనగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించి పూజలు అందుకున్న గణేషుడి చేతిలోని లడ్డూకు వేలం నిర్వహించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో అందరి కంటే ఎక్కువ మొత్తం రూ.1.55 లక్షలకు పాట పాడిన స్థానిక భక్తులు బడే శివనాగేశ్వర్‌రావు, సిరిగిరి కుమారస్వామిలు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ, అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మంచినీటిలో డ్రైనేజీ కలిసి కలుషితమై ప్రజలు అనారోగ్యం : పవన్‌కుమార్



కాలనీవాసులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** కొత్తపేట గ్రామంలో డ్రైనేజ్ నీళ్ల త్రాగునీటిలో కలుస్తుండడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారం మేరకు శనివారం అక్కడికి చేరుకుని సమస్యను పరిశీలించారు. జలమండలి డిజీఎం శ్రీనివాస్‌కి ఫోన్ చేసి సమస్యను వివరించారు. దశాబ్దాల క్రితం నాటి పైప్‌లైన్ వల్ల డ్రైనేజీ మురుగునీరు, మంచినీటి పైప్‌లైన్‌లో కలవడంతో మంచినీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని కార్పొరేటర్ పేర్కొన్నారు. మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్నుస్వామి యాదవ్, ప్రకాష్‌యాదవ్, అశోక్‌యాదవ్, గోపియాదవ్, గట్టు మహేష్, సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఎఇ ఎం.నిఖిల్ నరసింహారావు తెలిపారు. ఉప్పల్ 11 మార్కెట్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ప్రధాన రహదారి, గాంధీనగర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అదే విధంగా ప్రధాన రహదారిలో విద్యుత్‌లైన్లు మార్చుతున్నందున ఉప్పల్ లక్ష్మారెడ్డికాలనీ, ప్రధానరహదారి, హనుమసాయికాలనీ, సాయిరాంకాలనీ, రాఘవేంద్రనగర్, కల్యాణపురి, బ్యాంక్‌కాలనీ, ప్రశాంత్‌నగర్, బీరప్పగడ్డ, భరత్‌నగర్, శ్రీనగర్, ఐడిఏకాలనీ, సర్వే కాలనీ, ఆదర్శనగర్, చిలుకానగర్, సెవెన్‌హిల్స్ కాలనీ, కుమ్మరిబస్తీ, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8గంటలనుంచి సరఫరా నిలిపివేస్తున్నామని ప్రజలు అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి : శ్రీనాథ్‌రెడ్డి

### అండర్-19 క్రికెట్ జట్టుకు అనయ కళాశాల విద్యార్థులు



జట్టుకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

**వనస్థలిపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** హస్తినాపురం డివిజన్‌లోని అనయ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు దినేష్‌రాథోడ్, ధీరజ్ గౌడ్‌లు హైదరాబాద్‌అండర్-19 క్రికెట్ జట్టులో చోటు సాధించి జైపూర్‌లో జరిగే వినూ మాన్కడ్ ట్రోఫిలో ఆడేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాలచైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎం.బి.రెడ్డి, సిబ్బందితో కలిసి దినేష్, ధీరజ్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలన్నారు. క్రీడలపట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్రికెట్ కోచ్ యుగంధర్ ప్రోత్సాహంతో మరెంతో మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణనిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సైదిరెడ్డి, రామకృష్ణగౌడ్, వేణు, ఉష, మానస, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా తొలగింపు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



టీఎస్ఐఐసీ ఎం.డి. నర్సింహారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ఆటోనగర్‌లోని ఇసుక లారీల అడ్డా తొలగింపులో శనివారం టీఎస్ఐఐసీ ఎం.డి. నర్సింహారెడ్డిని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సంవత్సరాలనుండి ఉన్న ఇసుక లారీల అడ్డా వల్ల దాదాపు చుట్టుపక్కల ఉన్న 15 కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహిళలు,వృద్ధులు రాత్రి పూట అటువైపు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఆటోనగర్ లోపల ఉన్న దాదాపు 11 ఎకరాల స్థలంలో లారీలు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో వెంటనే అనుమతి ఇవ్వడం జరిగింది. అతి త్వరలో లారీల బెడదనుండి ప్రజలకు పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందని తెలిపారు. అలాగే నూతనంగా కేటయించే స్థలంలో వారికి కనీస సౌకర్యాలు అయిన మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు, పడుకోవడానికి తగిన వసతులు కల్పించాలని కోరారు. రెండు రోజుల్లో ఆటోనగర్ లారీల అడ్డా వద్ద సమావేశం నిర్వహిస్తామని నర్సింహారెడ్డిని రావాలని ఎమ్మెల్యే కోరడంతో వస్తామన్నారు. గత కొన్ని రోజుల క్రితం ఆటో నగర్ పారిశ్రామిక ప్రాంతంలో నూతన రోడ్డు నిర్మాణ పనులతోపాటు రోడ్డు వెడల్పు 7 మీటర్ల నుంచి 11 మీటర్ల వరకు వెడల్పు పెంచాలని కోరడంతో రోడ్డువెడల్పు విషయం గురించి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బారాస అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్‌గౌడ్, శ్రావణ్, లక్ష్మణ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

## వేగంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బలాల



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న బాలరాజ్

**మలక్‌పేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడతున్నామని ఎమ్మెల్యే అహ్మద్‌బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్‌లోని రాజనర్సింహ్మనగర్‌లో రూ. 19.35లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక సంక్షేమ సంఘంనాయకుడు, గ్రేటర్ ప్రధానకార్యదర్శి చిగురు బాలరాజ్ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, రాజేష్, సంతోష్, కుమార్, రమేష్, శివ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారుర. అదే విధంగా ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బలాల పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైపుద్దీన్ షఫీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైశ్య గర్జనను విజయవంతం చేయాలి

**సైదాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** ప్రభుత్వం వెంటనే వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు ఒకటో తేదీన నిర్వహించే వైశ్య గర్జనను విజయవంతం చేయాలని బిఆర్‌టియు ఎల్‌బినగర్ నియోజకవర్గ ఇంఛార్జి ఉప్పల శ్రవణ్‌కుమార్‌గుప్తా కోరారు. అక్టోబరు 1న మధ్యాహ్నం 3 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే వైశ్య గర్జనకు పార్టీలకతీతంగా తరలిరావాలని ఆయన కోరారు. వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, వైశ్య బంధు ప్రకటించాలని, దామాషా ప్రకారం వైశ్యులకు రాజకీయ వాటాతోపాటు ఇడబ్లుఎస్‌లో వర్గీకరణ చేయాలని, సమగ్ర కుటుంబ సర్వే నివేదికలోని గణాంకాలను తెలియజేయాలని, వైశ్య ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు ఆర్థిక చట్టపరమైన వెసులుబాటు, ఇండస్ట్రియల్ కారిడర్లలో వైశ్యులకు 25శాతం కేటాయించాలని, వైశ్య ఉమెన్ ఎంపర్‌మెంట్‌కు ఉమెన్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో వైశ్య గర్జనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నేడు సరూర్‌నగర్ స్టేడియంలో వైశ్య గర్జన



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కాచం సత్యనారాయణ తదితరులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** వైశ్య జాతి హక్కులు, ఆత్మగౌరవం కోసం అక్టోబర్ 1 ఆదివారం నిర్వహించే వైశ్య గర్జనను విజయవంతం చేయాలని వైశ్య వికాసవేదిక ఫౌండర్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా కోరారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే వైశ్య గర్జన ఏర్పాట్లను ఆయన శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాచం మాట్లాడుతూ వైశ్యజాతి అభివృద్ధికి ప్రభుత్వాలు, వైశ్యకమిషన్, వైశ్యకార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ వర్గీకరణలో వాటా, నిరుపేద వైశ్యులకు వైశ్య బంధు ఇవ్వడంతో పాటు పలు తీర్మానాలను వైశ్య గర్జన సభలో ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. వైశ్య జాతి పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై వైశ్య గర్జనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ గాంధీ, వైశ్య వికాస వేదిక సభ్యులు నంగునూరు రమేష్, దయాకర్, బుక్క ఈశ్వరయ్య, సతీష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శౌర్య జాగరణ యాత్రలను విజయవంతం చేయండి : విశ్వహిందూ పరిషత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తదితరులు

**సైదాబాద్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** విశ్వ హిందూ పరిషత్ భజరంగ్‌దళ్ వివేకానంద జిల్లా(దిల్‌సుఖ్‌నగర్) ఆధ్వర్యంలో జరిగే శౌర్య జాగరణ యాత్రలను విజయవంతంచేయాలని జిల్లా కార్యదర్శి కె.రాజేందర్‌రెడ్డి కోరారు. అఖిల భారత విహెచ్‌పి భజరంగ్‌దళ్ ఆదేశానుసారంగా దేశవ్యాప్తంగా జరిగే శౌర్య జాగరణ యాత్రలు యువతలో దేశ భక్తిని, దైవ భక్తిని తట్టిలేపే విధంగా కొనసాగుతాయని, దేశంకోసం ప్రాణాలర్పించిన దేశభక్తులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. అక్టోబరు 2 సాయంత్రం 5.30కు బిఎన్‌రెడ్డినగర్ ఆటో స్టాండ్ వద్ద, అక్టోబరు 8న సాయంత్రం 5.30కు సరూర్‌నగర్ చెరువు కట్టపై శౌర్యజాగరణ యాత్ర ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరు ఈ శౌర్య జాగరణ యాత్రల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్ సంయోజక మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు జి.రవి, సహ కార్యదర్శి వెంకన్న, సహప్రచారప్రముఖ్ పి.శ్రీనివాస్, బిజెడిఎల్ సహ సంయోజక్ అరుణ్, బలోపాసన ప్రముఖ్ ఎన్.రాజేందర్, సురక్ష ప్రముఖ్ సాయిప్రసాద్, ప్రఖండ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, మదనమోహనాచార్యులు పాల్గొన్నారు.